క్లుప్తంగా

తోటివారికి సాయం చేద్దాం



పరికరాలు అందిస్తున్న జేఎస్ఎస్‌డబ్ల్యూ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు పుత్ర హనోక్

బోట్‌క్లబ్: ప్రతి ఒక్కరూ తమకు తోచిన విధంగా తోటివారికి సహాయం చేయాలని జేఎస్ఎస్ డబ్ల్యూ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు పుత్ర హనోక్ అన్నారు. మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో స్థానిక పేర్రాజు పేటలోని విముక్తి కాలనీలో కుష్టు వ్యాధిగ్రస్తులకు నిత్యావసరాలు, వీల్ చైర్లు, ట్రై సైకిళ్లు, ఆర్టిఫీషియల్ లింబ్స్ గురువారం పంపిణీ చేశారు. మానవ జీవితం ఎంతో ఉన్నతమైందని, ఇతరులకు సహాయం చేయడం ఈ సృష్టిలో మానవులకే సాధ్యమన్నారు. నిరుపేదలను ఆదుకోవడంలో ఉన్న ఆనందం మరిదేనిలోనూ ఉండదన్నారు. కాకినాడ, చొల్లంగిపేట, పెద్దాపురం, కాలేరు, రామచంద్రపురం, సువార్తపేట, బ్రహ్మదేవం, కేశవరం, బంగ్లాతోట చెందిన 370 మంది కుష్టు వ్యాధిగ్రస్తులకు వివిధ పరికరాలు అందించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు పి.జాకబ్ సుందర్, పీబీ ఎలిజబెత్, వై.బంటిబాబు, కొల్లూరి సామ్య, కాలే గ్లోరీ శాంత, ప్రభుదాస్, జాన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న గోపీమూర్తి

కాకినాడ సిటీ: వచ్చే నెల 5న జరిగే తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజక వర్గ శాసనమండలి ఎన్నికల్లో ఉపాధ్యాయ, అధ్యాపక ఓటర్లలంతా తనను బలపరిచి మొదటి ప్రాధాన్య ఓటు వేయాలని పీడీఎఫ్ అభ్యర్థి బొర్రా గోపీమూర్తి విజ్ఞప్తి చేశారు. గురువారం స్థానిక కచేరిపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో గోపీమూర్తి మీడియాతో మాట్లాడారు. తనను శాసనమండలికి పంపిస్తే ఉపాధ్యాయ, అధ్యాపక, ఉద్యోగ, కార్మిక, పెన్షనర్ల సమస్యల సాధనకు కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు పాటుపడతానన్నారు. సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టి.అన్నారాము, జిల్లా ప్రధాన కార్యదర్శి టి.రవి చక్రవర్తి, జిల్లా అధ్యక్షుడు నగేష్, అసోసియేట్ అధ్యక్షులు బి.నాగమణి, రమణ పాల్గొన్నారు.

విద్యార్థినుల చదువుకు అండగా..



విద్యార్థినులకు సాయం అందజేస్తున్న సతీష్

కాకినాడ క్రైం: తన తండ్రిని కోల్పోయి చదువుకునేందుకు కష్టాలు పడుతున్న ఇద్దరు విద్యార్థినులకు శ్రీయువసేన స్వచ్ఛంద సేవా సంస్థ అండగా నిలిచింది. రామచంద్రపురానికి చెందిన వాసంశెట్టి అప్పారావు కొద్ది రోజుల కిందట గుండె పోటుతో మరణించారు. ఆయన కుమార్తెలు కృష్ణ పరిమళ, లోక ప్రవల్లిక ఆర్‌కే కళాశాలలో జీఎస్ఎం ఫైనల్ ఇయర్ చదువుతున్నారు. తండ్రిని కోల్పోయిన వారు చివరి ఏడాది ఫీజు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న శ్రీయువసేన వ్యవస్థాపకుడు డాక్టర్ సతీష్ విద్యార్థినుల ఇద్దరికీ వారి ఫీజు నిమిత్తం చెరో రూ.20 వేల చొప్పున సాయాన్ని గురువారం కాకినాడ గ్లాస్ హౌస్ సెంటర్‌లోని శ్రీ యువసేన బ్లడ్ బ్యాంక్‌లో అందించారు.

కాకినాడ అధికారుల ఫోన్ నంబర్లు

మున్సిపల్ అధికారులు	
కమిషనర్	9100945696
అదనపు కమిషనర్	9849907096
డిప్యూటీ కమిషనర్	9949921555
ఏసీపీ	9989743049
ఎంహెచ్‌వో	9949432320
ఎస్ఈ	9959988639
మేనేజర్	7093519888
టీపీఆర్వో	9701385284
అకౌంట్ ఆఫీసర్	9849907084
సిటీ మిషన్ మేనేజర్	7901610084
పంచాయతీ అధికారుల ఫోన్ నంబర్లు	
డివిజనల్ పంచాయతీ అధికారి	9849903188
ఫుడ్ ఇన్‌స్పెక్టర్	9494297564
ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ	9100121109
జిల్లా వ్యవసాయశాఖాధికారి	8331056483
దేవదాయశాఖ	9290145126
డివిజన్ ఇన్‌స్పెక్టర్	
గృహ నిర్మాణశాఖ డీఈ	7093930577
పశుసంవర్ధకశాఖ జేడీ	9989932835
డీసీసీబీ జీయం	8341208227
జిల్లా సహకారశాఖ అధికారి	9100109168
జీజీహెచ్‌లో ముఖ్యమైన ఫోన్ నంబర్లు	
సూపరింటెండెంట్	98499 03870, 0884 2302001
సీఎస్ ఆర్ఎంవో	98499 03871
డీసీఎస్ ఆర్ఎంవో	98499 03871
ఆర్ఎంవో	0884 2302003
డిప్యూటీ కలెక్టర్, అడ్మినిస్ట్రేటర్	0884 2302002
అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ)	98499 03873, 0884 2302004
పోలీస్ అవుట్‌పోస్ట్	83329 57924
అత్యవసర విభాగం	0884 2302021
బ్లడ్ బ్యాంక్	0884 2302009
మెడికల్ రికార్డ్స్ సెక్షన్ (ఎంఆర్‌డీ)	0884 2302018

భళా... బాలల పట్టుదల

- ప్రతిభకు పదును
- వివిధ విభాగాల్లో రాణిస్తున్న బాలభవన్ విద్యార్థులు

బోట్‌క్లబ్: ప్రస్తుతం విద్యార్థులకు క్షణం తీరిక ఉండడం లేదు.. ఎప్పుడు చూసినా పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు.. కాస్త తీరిక దొరికితే సెల్‌ఫోన్, మరికాస్త తీరిక దొరికితే టీవీ చూడడం చూస్తుంటాం. ఉదయం లేచింది మొదలు సాయంత్రం స్కూల్ నుంచి ఇంటికి తిరిగివచ్చే వరకూ చదువులతో అలసిపోతుంటారు. ఇంత బిజీలోనూ పలువురు విద్యార్థులు పట్టుదలతో తమకు నచ్చిన రంగంలో రాణిస్తున్నారు. కాకినాడ గాంధీనగర్‌లోని బాలభవన్‌లో సంగీతం, కరాటే వంటి వాటిలో శిక్షణ తీసుకుని రాణిస్తున్నారు. నేర్చుకోవాలనే తపన ఉండాలే కానీ ఏదీ సాధ్యం కాదని నిరూపిస్తున్నారు ఆ చిన్నారులు తల్లిదండ్రులు, గురువుల ప్రోత్సాహంతో చిన్ననాటి నుంచి సంగీతం, కరాటే పోటీల్లో శిక్షణ పొందుతూ ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు. సంగీతం, కరాటేతో పాటు మృదంగంలో ప్రతిభ చూపుతూ అనేక అవార్డులు అందుకుని అందరి మన్ననలు పొందుతూ భళా అనిపించుకుంటున్నారు.

పంచ్ కొడితే పతకమే..

ఇరగవరపు సుష్మ ప్రస్తుతం 9వ తరగతి చదువుతోంది. సంగీతం అంటే ఇష్టంతో ఐదేళ్ల క్రితం బాలభవన్‌లో చేరి గాత్ర సంగీతంలో శిక్షణ పొందుతుంది. సంగీతంలో పాటు కరాటేలో ఆసక్తి చూపడంతో కరాటే మాస్టర్ మూర్తి వద్ద శిక్షణ తీసుకొంటుంది. అనేక పోటీల్లో పాల్గొన్న సుష్మ పలు బహుమతులు తన ఖాతాలో వేసుకొంది. కరోనా ముందు అమలాపురంలో నిర్వహించిన సౌత్‌జోన్ దక్షణాది రాష్ట్రాల క్రీడాకారులను ఢీకొని గోల్డ్‌మెడల్ పొందింది. ఇటీవల సామర్లకోటలో నిర్వహించిన సౌత్‌జోన్ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించింది.



కరాటేలో మొదటి బహుమతి సాధించిన సుష్మ →

మృదంగంలో సత్తా చాటుతూ..



క్రియ పోటీల్లో బహుమతి అందుకుంటున్న విత్తనాల పవన్

విత్తనాల పవన్ శ్రీసాయి వెంకట్ ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్నాడు. తన 6వ ఏట నుంచే బాలభవన్‌లో మృందంగం నేర్చుకోవడం ప్రారంభించాడు. గురువు వారణాసి శ్రీనివాసు దగ్గర మెళకువలు నేర్చుకుని రాష్ట్ర, జిల్లా స్థాయిలో సుమారు 20కిపైగా బహుమతులు సాధించి అందరి మన్ననలు పొందుతున్నాడు. భవిష్యత్‌లో మృదంగంలో అంతర్జాతీయ స్థాయిలో రాణించాలనే తన లక్ష్యమని గర్వంగా చెబుతున్నాడు.

సంగీతంలో రాణిస్తూ..



సంగీత కచేరి చేస్తున్న సాయి ప్రసీద

కాకినాడకు చెందిన రాజనాల సాయి ప్రసీద ప్రస్తుతం పదో తరగతి చదువుతుంది. వయోలిన్ అంటే ఆమెకు ఎంతో ఆసక్తి చూపడంతో తల్లిదండ్రులు రఘురామ్, లక్ష్మీలు నాలుగు సంవత్సరాల కిందట నుంచి బాలభవన్‌లో శిక్షణ ఇప్పిస్తున్నారు. గురువు రామచంద్రమూర్తి వద్ద వయోలిన్, గాత్ర సంగీతంలో శిక్షణ నేర్చుకుని పలు పోటీల్లో రాణిస్తుంది. రాజమహేంద్రవరంలో సద్గురు సన్నిధి వారు నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రోత్సాహక బహుమతి సాధించింది. బాలభవన్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో మూడేళ్లుగా ప్రథమ బహుమతి అందుకుంటుంది. క్రియ పోటీల్లో పాల్గొని తృతీయ బహుమతి సాధించింది.

ఉచిత శిక్షణ ఇస్తున్నాం..

ప్రతి రోజూ మధ్యాహ్నం 12.30 నుంచి సాయంత్రం 7 గంటల వరకూ శిక్షణ ఉంటుంది. ఆదివారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ శిక్షణ ఇస్తున్నాం. ప్రతి శుక్రవారం శెలవు. ప్రస్తుతం 400 మంది చిన్నారులు ఇక్కడ అడ్మిషన్లు పొందారు. రోజూ 100 మందిపైగా చిన్నారులు వారికి ఇష్టమైన రంగంలో ఉచిత శిక్షణ పొందుతున్నారు.



-ఎ.శారద, బాలభవన్ సూపరింటెండెంట్

మందపల్లికి కలెక్టర్ అభినందనలు



మందపల్లి శ్రీనివాసరావును అభినందిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: ఆలిండియా నేషనల్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ విజేత మందపల్లి శ్రీనివాసరావును గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్ అభినందించారు. ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు పంజాబ్‌లో నిర్వహించిన ఆలిండియా నేషనల్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీలలో 550 మంది పవర్ లిఫ్టర్స్ పాల్గొనగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏపీఎస్ ఆర్టీసీ సంస్థలో కాకినాడ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్న ఎం.శ్రీనివాసరావు 450 కిలోల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించారు. జనవరి 2025లో బెంగళూరులో జరగబోయే వరల్డ్ వైడ్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు కాకినాడ జిల్లా నుంచి ఎంపికైన సందర్భంగా కలెక్టర్ షణ్మోహన్‌ను జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్‌కుమార్‌తో కలిసి మందపల్లి శ్రీనివాసరావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ షణ్మోహన్ అభినందించారు. భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని పతకాలు సాధించి దేశానికి మంచి పేరు తెచ్చేందుకు కృషి చేయాలని అభిలషించారు.

ధన్వంతరి అలంకరణలో సీతారామస్వామి



మెయిన్ రోడ్డులో సీతారామస్వామి

బోట్‌క్లబ్: రజిత చిన్న దశావతార అలంకార ఉత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక మెయిన్ రోడ్డులోని సీతారామస్వామి ధన్వంతరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి వారికి అర్చకులు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి పూజలు

బోట్‌క్లబ్: స్థానిక పేర్రాజుపేటలోని ఎస్‌వీ సాయిబాబా గురుస్వామి పీఠంలో గురువారం అయ్యప్పస్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం సహస్రనామ పూజ చేశారు. స్వామివారిని నూతన వస్త్రాలు, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. అయ్యప్పస్వామి శరణుఘోషతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. దత్తాత్రేయ గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.



← ప్రత్యేక అలంకరణలో అయ్యప్పస్వామి

ఉడిపి స్వామీజీకి అపూర్వ స్వాగతం



ఉడిపి స్వామీజీకి స్వాగతం పలుకుతున్న రాఘవేంద్ర బృందావనం ట్రస్ట్ సభ్యులు

బోట్‌క్లబ్: ఉడిపి శిరూర్ మఠాధిపతులు వేద వర్ధన తీర్థ స్వామీజీకి గురువారం స్థానిక రాఘవేంద్ర స్వామి బృందావనం ప్రాంగణంలో ట్రస్ట్ సభ్యులు, భక్తులు ఘన స్వాగతం పలికారు. తొలుత స్వామీజీ రాఘవేంద్రస్వామి బృందావనానికి ప్రత్యేక హారతులు ఇచ్చా రు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి మాట్లాడు తూ కలియుగ కల్పవృక్షమైన రాఘవేంద్రస్వామి అనుగ్రహాన్ని అందరూ పొందాలన్నారు. హిందూ ధర్మ ప్రచారానికి అందరూ కంకణ బద్ధులై ఉండాలన్నారు. ట్రస్ట్ కమిటీ కోశాధికారి వై.వెంకటేష్ ట్రస్ట్ సభ్యులను స్వామీజీకి పరిచయం చేశారు.

కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు భగీరథ శర్మ, కార్యదర్శి వై.రాఘవేంద్రరావు, సంయుక్త కార్యదర్శి సత్యరాజు వెంకటరత్నం, ఉపాధ్యక్షుడు ఎస్.అనంత రామారావు పాల్గొన్నారు.

సోమనాథేశ్వర వజ్ర లింగ దర్శనం



కాకినాడలో సోమనాథేశ్వర వజ్ర లింగం

బోట్‌క్లబ్: కార్తిక మాసం సందర్భంగా బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో సోమనాథేశ్వర వజ్ర లింగ దర్శనం గురువారం నగర ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది. సోమనాథేశ్వర వజ్రలింగం ప్రత్యేక రథంలో నగరంలో పలు ప్రాంతాల్లో దర్శనం నిమిత్తం ఉంచారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీ చంద్రశేఖర్ మాట్లాడుతూ 2018లో హిందూపూర్ నుంచి ఈ రథయాత్ర ప్రారంభమైందన్నారు. నాలుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రాంతాల్లో భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తున్నామన్నారు. ధర్మ జాగృతితో పాటు పరమాత్ముని దివ్య అవతరణ, ఆయన కర్తవ్యాలను అందరికీ తెలియజేయాలన్న శుభ సంకల్పంతో ఈ రథయాత్రను నిర్వహిస్తున్నామన్నారు. సమాజంలో నైతిక విలువలు కోల్పోయి దుఃఖం, అశాంతి పెరిగిపోయిందన్నారు. గ్రామీణ వికాసం విభాగం ద్వారా ఆదర్శ గ్రామాలు నిర్మించాలన్నదే తమ ఆశయమన్నారు. కాకినాడ డీమార్ట్ సమీపంలో ఉన్న బ్రహ్మకుమారి రాజయోగ మెడిటేషన్ సెంటర్ ద్వారా కార్తిక మాసం సందర్భంగా విశేష దీపోత్సవం నిర్వహిస్తామన్నారు. సెంటర్ ప్రతినిధి మీరా గంగా మాట్లాడుతూ ద్వాదశ జ్యోతిర్లింగాలను ప్రతిష్ఠించి భక్తులు దర్శించుకునే విధంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వాసవి, రాజు, రాము పాల్గొన్నారు.

ఉద్యోగుల రక్తదానం



రక్తదానం చేస్తున్న యూనియన్ బ్యాంక్ ఉద్యోగులు

బాలాజీచెరువు: ఆంధ్రాబ్యాంక్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆ బ్యాంక్ ఉద్యోగులు గురువారం రక్తదానం చేశారు. స్థానిక తిలక్‌వీధిలో యూనియన్ బ్యాంక్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ సాయి మనోహర్ హాజరై మాట్లాడుతూ స్వాతంత్ర్య సమర యోధుడు భోగరాజు పట్టాభిరామయ్య 1923లో స్థాపించిన ఆంధ్రాబ్యాంక్ 2022లో యూనియన్ బ్యాంక్‌లో విలీనమైందన్నారు. ఖాతాదారుల సేవలే లక్ష్యంగా తమ సిబ్బంది పని చేస్తున్నారన్నారు. అనంతరం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరంలో 53 మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజనల్ హెడ్ నారాయణరావు, బ్రాంచ్ మేనేజర్ రాజశేఖర్, ఉద్యోగుల సంఘ నాయకుడు ఎం.దుర్గాప్రసాద్, బ్యాంక్ ఎంప్లాయీస్ కోఆర్డినేషన్ కమిటీ కార్యదర్శి పి.ఆదినారాయణ పాల్గొన్నారు.

పెరిగిన చలి గాలులు

కాకినాడ రూరల్: కాకినాడ, పరిసర ప్రాంతాల్లో చలి గాలుల తీవ్రత అధికమైంది. బంగాళాఖాతంలో తుపాను ప్రభావంతో రెండు రోజులుగా వాతావరణం చల్లబడింది. చలి తీవ్రత క్రమేపీ పెరగడంతో వృద్ధులు బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు.

డ్వాక్రా ఉత్పత్తులను ప్రోత్సహించండి



మెప్మా అర్బన్ మార్కెట్‌ను పరిశీలిస్తున్న టీపీఆర్‌ఓ శైలజ

కాకినాడ: డ్వాక్రా ఉత్పత్తులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని టీపీఆర్‌ఓ కె.శైలజ పిలుపునిచ్చారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన డ్వాక్రా ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలకు సంబంధించిన మెప్మా అర్బన్ మార్కెట్‌ను స్థానిక పోలీస్ రిజర్వు లైన్ సమీపంలోని మీ సేవ కేంద్రం వద్ద ఆమె గురువారం ప్రారంభించారు. నగరంలోని పలువురు డ్వాక్రా సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులను ఇక్కడ ప్రదర్శనలో ఉంచారు. ఈ కార్యక్రమాన్ని టీపీఆర్వో శైలజ, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ దేగల వెంకటరాజు సందర్శించారు. ఎంతో శ్రమకోర్చి మహిళా సంఘాల సభ్యులు తయారు చేసిన ఇటువంటి ఉత్పత్తులను ప్రజలు ఆదరించాలని ఆమె కోరారు. ప్రతి నెలా వేర్వేరు ప్రాంతాల్లో ఈ మెప్మా అర్బన్ మార్కెట్లను ఏర్పాటు చేసి, తక్కువ ధరకు నాణ్యమైన ఉత్పత్తులను ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. కార్యక్రమంలో పలువురు ఆర్పీలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేయొద్దు



బాల్య వివాహ ముక్త భారత్ అవగాహన కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఐసీడీఎస్ పీడీ ప్రవీణ

బోట్‌క్లబ్: బాల్య వివాహాలు చేయడం నేరమని ఐసీడీఎస్ పీడీ ప్రవీణ అన్నారు. స్థానిక గాంధీనగర్‌లోని ఐసీడీఎస్ కార్యాలయంలో ఈ నెల 28 నుంచి డిసెంబర్ వరకూ నిర్వహించే బాల్య వివాహ ముక్త భారత్ కార్యక్రమాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. చిన్న వయసులో ఆడ పిల్లలకు పెళ్లి చేయడంతో తల్లితోపాటు పుట్టే బిడ్డకు అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు పిల్లలకు తగిన వయసు వచ్చిన తర్వాత వివాహం చేయాలన్నారు. చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ కో ఆర్డినేటర్ స్వర్ణలత మాట్లాడుతూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లాలో ఐదు మండలాల్లో 50 గ్రామాల్లో ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు బాల్య వివాహ ముక్త భారత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఫౌండేషన్ ముద్రించిన అవగాహన కరపత్రాలను ఆమె ఆవిష్కరించారు.

రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు

బోట్‌క్లబ్: ధాన్యం కొనుగోళ్లలో రైతులను తేమ పేరుతో ఇబ్బందులకు గురిచేయవద్దని బీజేపీ రాష్ట్ర మీడియా అధికారి ప్రతినిధి యార్లగడ్డ రామ్‌కుమార్ అధికారులను కోరారు. గురువారం కాకినాడలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తేమ శాతం ఎక్కువగా ఉన్నందున మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో ధాన్యం రాశులు రోడ్లపైనే వేసుకోవాల్సి వచ్చిందన్నారు. ప్రభుత్వం తేమ శాతం చూడవద్దని చెప్పినా కొందరు మిల్లర్లు తేమ శాతం బూచిగా చూపి బస్తాకు రూ.100 నుంచి రూ.150 వరకూ కోత విధిస్తున్నారన్నారు. ఈ విషయం అధికారులకు చెప్పవద్దంటూ, చెబితే ధాన్యం వెనక్కి తీసుకెళ్లాలని రైస్‌మిల్లు యజమానులు రైతులు బెదిరిస్తున్నారన్నారు. ఆరుగాలం శ్రమించి పండిన రైతులను దోపిడీకి గురిచేస్తున్న మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అధికారులు స్పందించి రోడ్లపై ఉన్న ధాన్యం వీలైనంత త్వరగా కొనుగోలు చేసి రైతులు ఆదుకోవాలన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా కార్యదర్శి రంబాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జ్యోతిబా ఫూలే అందరికీ ఆదర్శం



మహాత్మా జ్యోతిబా ఫూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్



కాకినాడలో జ్యోతిబా ఫూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న 93 బీసీ కులాల ఐక్యవేదిక, బీసీ జేఏసీ నాయకులు

కాకినాడ సిటీ: వెనుకబడిన తరగతుల హక్కులు, స్త్రీ విద్య కోసం అహర్నిశలూ పోరాడిన మహోన్నత వ్యక్తి మహాత్మ జ్యోతిబా ఫూలే అని కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి కూడలి వద్ద ఉన్న మహాత్మ జ్యోతిబా ఫూలే విగ్రహానికి కలెక్టర్ షణ్మోహన్, బీసీ సంక్షేమ అధికారి ఎం.లల్లి, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.శ్రీనివాసరావు ఇతర అధికారులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జ్యోతిబా ఫూలే సాంఘిక న్యాయం, సమాన హక్కుల కోసం సత్యశోధక్ సమాజ్‌ను స్థాపించారన్నారు. బాల్య వివాహాలు, సతీసహగమనం వంటి దురాచారాలకు వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ డీడీ డి.నాగార్జున, కాకినాడ డివిజన్ సహాయ బీసీ సంక్షేమాధికారి ముత్యాల సుబ్బారావు, జిల్లా బీసీ సంక్షేమ అధికారి గోవాల సతీష్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, కార్పొరేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కరప: స్త్రీ విద్య, వితంతువుల పునర్వివాహాల కోసం పాటుపడిన సంఘ సంస్కర్త, మహాత్మ జ్యోతిబా ఫూలే అందరికీ ఆదర్శమని ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి అన్నారు. మహాత్మ జ్యోతిబా ఫూలే వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి నాయకులతో కలసి ఎంపీపీ శ్రీలక్ష్మి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో మార్పు రావాలని, బలహీన, బడుగు, అణగారిన వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేశారన్నారు. ఆయన భార్య సావిత్రీబాయి ఫూలేతో కలసి ప్లేగు వ్యాధి బాధితులకు చేసిన సేవలు మరువలేనివన్నారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మేడిశెట్టి సత్తిబాబు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పెంకే సత్తిబాబు, వలసపాకల సర్పంచ్ వాసంశెట్టి రామారావు, మంచాల శ్రీను, పితాని శ్రీను, కమిడి శంకర్, తుట్టా ప్రసాద్, వనుం భాస్కర్, వనుం శ్రీనివాస్, మారెళ్ల గోపి, ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ సిటీ: మహాత్మా జ్యోతిబా ఫూలే వర్ధంతిని పురస్కరించుకుని కాకినాడ సిటీ గర్ల్స్ పాలిటెక్నిక్ వద్ద ఫూలే విగ్రహానికి 93 బీసీ కులాల ఐక్యవేదిక, బీసీ జేఏసీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. మాకిరెడ్డి భాస్కర్ గణేష్‌బాబు మాట్లాడుతూ మహాత్మ జ్యోతిబా ఫూలే బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడ్డారన్నారు. విజయవాడలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని నెలకొల్పారన్నారు. అలాగే ప్రభుత్వం మహాత్మ జ్యోతిబా ఫూలే విగ్రహాన్ని అమరావతిలో పెట్టాలని ఆయా సంఘాల నాయకులు కోరారు. బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ చొల్లంగి వేణుగోపాల్, పెరిక సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ వనపర్తి బద్రి, రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ సంఘ నాయకులు అవుపాటు ఉమాశంకర్, సంచార జాతుల డైరెక్టర్ పెద్దిరాజు, బీసీ నాయకులు అనుసూరి ప్రభాకర్, రమణ, పెంకే శ్రీనివాస్‌బాబా పాల్గొన్నారు.



కరపలో జ్యోతిబా ఫూలే విగ్రహానికి నాయకులతో కలసి పూలమాలలు వేసిన ఎంపీపీ శ్రీలక్ష్మి